

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విధిగా పోలియో చుక్కలు వేయాలి..

దేశాయిపేట అర్బన్ సెంటర్‌లో చుక్కలు వేసిన కలెక్టర్

పోచమ్మమైదాన్, మార్చి 3: ఐదేళ్ల లోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ నగరం దేశాయిపేట అర్బన్ సెంటర్‌లో చిన్నారికి కలెక్టర్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 3నుంచి 5వ తేది వరకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసే విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. ప్రతీ ఇంటింటికి తిరిగి చిన్నారులకు చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 118 ఉప ఆరోగ్య కేంద్రాలు, 2,15,662 నివాస గృహాలు, 25 ట్రాన్సిట్ పాయింట్లు, 176 హైరిస్క్ కేంద్రాలు, 523 పోలియో బూత్ కేంద్రాలు, 1,046 టీమ్‌ల ద్వారా 53 రూట్లలో 2,332 వ్యాక్సినేటర్ల ద్వారా జిల్లాలో 75,227 మంది 0-5 చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌వోలు డాక్టర్లు గోపాల్‌రావు, ప్రకాష్, భరత్, మాస్ మీడియా అధికారి అనిల్‌కుమార్, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఎగ్బాల్ పాల్గొన్నారు.



అరూరి రమేష్



గులాబీకి ఝలక్!

బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

- వరంగల్ ఎంపీగా బరిలో దిగుతారని ప్రచారం
- త్వరలో ప్రధాని మోదీ సమక్షంలో చేరిక
- మరో మాజీ ఎంపీ చూపు కమలం వైపు
- మహబూబాబాద్ టికెట్ కోసం చర్చలు
- వరంగల్ మేయర్‌తో సహా పలువురు కార్పొరేటర్లు హస్తం గూటికి..
- సీఎం సమక్షంలో చేరేందుకు ఏర్పాట్లు
- కాంగ్రెస్‌లో చేరిన వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు చూపు హస్తం వైపు

వరంగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గులాబీ పార్టీకి నేతలు ఝలక్ ఇస్తున్నారు. ఒక్కొక్కరుగా కారు దిగి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇటీవల మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య పార్టీని వీడగా, తాజాగా వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. బీజేపీలో చేరేందుకు రమేష్ రంగం సిద్ధం చేసుకున్నారు. మరో వైపు వరంగల్ నగర మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అలాగే వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరగా, డీసీసీబీ చైర్మన్ మార్నేని సైతం పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నట్లుగా సమాచారం. ఒక్కొక్కరు కారు దిగుతుండటంతో గులాబీ పార్టీకి భారీ షాక్‌గా మారుతుంది. వివరాల్లోకి వెళితే..

ఓటమితో గులాబీ డీలా...

గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ఓటమితో డీలా పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, భూపాలపల్లి మినహా 10 చోట్ల గులాబీ పార్టీ విజయం సాధించింది. ఆ తరువాత మూడు నెలలకే భూపాలపల్లి ఎమ్మెల్యే హస్తం పార్టీ వీడి గులాబీ కారు ఎక్కారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎదురులేకుండా రాజకీయాలు నడిచాయి. అయితే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో సహా కీలక నేతలు ఓటమి పాలవ్వడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేవలం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో గులాబీ క్యాడర్ డీలా పడింది. పైగా 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఏ నియోజకవర్గం ఏ రిజర్వుడు కోటాలోకి వెళతుందో అనే ఆందోళనతో ఉన్న నేతలు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క పెట్టుకోవాలనే ఆలోచనతో పక్క పార్టీల వైపు చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్‌లో అసమ్మతి గళం విప్పిన మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఒక్కొక్కరు గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమవుతుండటం గులాబీ శ్రేణుల్లో ఆందోళనకు గురి చేస్తోంది.

గులాబీ పార్టీకి అరూరి గుడ్‌బై..?

గులాబీ పార్టీకి మరో భారీ షాక్ తగలనుంది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీని వీడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్న అరూరికి గులాబీ అధిష్ఠానం నుంచి సానుకూలత రాలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ ఎంపీ బరిలో దించేందుకు బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నుంచి అరూరి రమేష్‌కు ఆఫర్ వచ్చింది. దీంతో తన అనుచర వర్గంతో గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. బీజేపీ జాతీయ నేతల నుంచే ఆహ్వానం రావడంతో బీజేపీలో చేరి వరంగల్ ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అరూరి రమేష్ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీకి అవకాశం లేకపోవటంతో బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న అరూరి రమేష్‌కు వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. దీంతో పాటు బలమైన మాదిగ సామాజిక వర్గం నేత కావడంతో అరూరి రమేష్‌ను బరిలో దించితే గెలిచే అవకాశాలు ఉంటాయని బీజేపీ కూడా అంచనా వేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం నుంచి వస్తున్న ఆహ్వానంతో పార్టీ మారేందుకు అరూరి నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మేయర్ గుండు సుధారాణి

కాగా, రమేష్ పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారంతో బీఆర్ఎస్ అగ్ర నేతలు అలర్ట్ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అరూరితో ఫోన్‌లో సంప్రదింపులు చేసినట్లుగా తెలిసింది. అయితే పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నానని, ఇన్ని రోజులు పార్టీలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపినట్లుగా సమాచారం. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సైతం నేరుగా రమేష్ నివాసానికి వెళ్లి పార్టీ తరఫున బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ అరూరి పార్టీ మారేందుకే ఫిక్స్ అయినట్లుగా తేల్చి చెప్పినట్లుగా సమాచారం. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పార్టీలో చేరటం లేదంటే మరో రోజు ఢిల్లీకి వెళ్లి పార్టీలో చేరడం జరుగుతుందని అరూరి సన్నిహితులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మొత్తానికి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పనిచేసిన అరూరి రమేష్ పార్టీని వీడేందుకు

మిగతా 5వ పేజీలో..

కమలం వైపు మాజీ ఎంపీ చూపు..?

బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలేలా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న ఓ మాజీ ఎంపీ సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మరోసారి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. అయితే ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తన కుమారుడి కోసం మహబూబాబాద్ టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అయితే తనకు ఈసారి కూడా బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం కష్టమేననే నారాజ్‌లో ఉన్న ఓ మాజీ ఎంపీకి బీజేపీ నేతల నుంచి పోటీ చేసేందుకు పార్టీలో చేరాలని ఆహ్వానం అందినట్లుగా ప్రచారం జరుగుతోంది. అనుచరుల ఒత్తిడి మేరకు బీజేపీలో చేరేందుకు ఆ మాజీ ఎంపీ కూడా సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది.



కాంగ్రెస్ పార్టీలో చేరిన మునిసిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

వర్ధన్నపేట, మార్చి 3: వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనిమిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, అంగోతు భిక్షపతి, పలువురు డివిజన్ అధ్యక్షులతోపాటు ముఖ్య నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తొలుత ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరి పార్టీ కండువా కప్పుకున్నారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, కె.ప్రభాకర్‌గౌడ్ ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

నాటక రంగాన్ని బతికించాలి..

- టీవీ, సినిమా మోజులో పడిన జనం..
- డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ
- ప్రారంభమైన నాటక పోటీలు
- ఘనంగా శోభాయాత్ర .. ఆలోచింపజేసిన నాటికలు

5



నిశ్శబ్దమా, నీ ఖరీదెంత నాటకంలో ఓ సన్నివేశం

నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కలెక్టరేట్, మార్చి 3: ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్‌సెల్ యథావిధిగా సాగుతుందని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల్ని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

కొలువు దీరిన దామేశ్వరుడు

- ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం
- పులకించిన భక్త జనులు
- హాజరైన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

5



దామేశ్వరాలయంలోని శివలింగం

ఆగ్రోస్‌పై ఆరా!

- ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల సేవలపై సర్కారు పరిశీలన
- ప్రైవేటు లైసెన్స్‌తో ఆగ్రోస్ దుకాణాల్లో వ్యాపారాలపై తనిఖీలు

వరంగల్ సిటీ, మార్చి 3: ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు అన్నదాతకు అండగా ఉంటున్నాయా అనే కోణంలో కొత్త ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. జిల్లాలోని ఆగ్రోస్ కేంద్రాల పనితీరుపై పర్యవేక్షణను ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, సాగులో అన్నదాతకు అండగా నిలవాల్సిన ఆగ్రోస్ కేంద్రాలు నిర్వీర్యమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగ్రోస్ కేంద్రాలను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పరిశీలించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అధికార బృందాలు రంగంలోకి దిగాయి. కేంద్రాల వారీగా వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారానే రాయితీపై ఎరువులు, విత్తనాలు, యంత్రాలు పంపిణీ చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఆగ్రోస్ కేంద్రాలను అదే తరహాలో బలోపేతం చేసే దిశగా రేవంత్ సర్కార్ సిద్ధం అవుతోంది.

క్షేత్ర స్థాయిలో పరిశీలన

జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల పరిశీలన బృందాలు సమన్వయంతో సందర్శించాయి. జిల్లాలోని మొత్తం 26 ఆగ్రోస్ కేంద్రాలను జిల్లా పరిశీలన బృందాలు తనిఖీలు చేశాయి. తనిఖీల్లో భాగంగా క్షేత్ర స్థాయిలో కేంద్రాల పనితీరుపై మండల వ్యవసాయ అధికారితో కలిసి స్థానిక తహసీల్దారు సంయుక్తంగా విచారణ చేశారు. ఈ కేంద్రాల ద్వారా యువతకు ఉపాధి దొరుకుతుందా..?, రైతులకు ఎలాంటి సేవలు అందుతున్నాయి..? తదితర వివరాలను వారు సేకరించారు. మండలంలోని జనాభా ఎంత..? ఎన్ని ఆగ్రోస్ కేంద్రాలున్నాయి..? నిబంధనల మేరకే అనుమతులిచ్చారా..? ప్రస్తుతం రైతులకు సేవలు అందించేవి ఎన్ని..? మూత పడినవి ఎన్ని అనే కోణంలో ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో అధికార పరిశీలన బృందాలు సమగ్రంగా తనిఖీలు చేసి నివేదికను ప్రభుత్వానికి చేరవేశారు.



గత పాలకుల నిర్లక్ష్యం...

గ్రామాల్లోని రైతులకు ఎరువులు, వ్యవసాయ పరికరాలు తదితర అవసరాలు తీర్చేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సబ్సిడీతో అందజేసేందుకు మండలం అవసరం మేరకు ఒకటి, రెండు కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ కేంద్రాల ద్వారా మొదట్లో రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పంపిణీ చేశారు. దీంతో అప్పట్లో కేంద్రాలు లాభదాయకంగా పనిచేశాయి. ఆ తర్వాత ప్రభుత్వాలు మారిపోయి పాలకులు ఆగ్రోస్ కేంద్రాలను పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ప్రాధాన్యం క్రమక్రమంగా తగ్గిపోయింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ విషయాలు వెల్లడి కావడంతో తిరిగి ఆగ్రోస్ కేంద్రాలకు పునరుజ్జీవం కలిగించి రైతులను ఆదుకునే విధంగా కేంద్రాలను బలోపేతం చేసే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారానే

మిగతా 6వ పేజీలో..

ఆగ్రోస్ కేంద్రాలపై నివేదికను అందించాం..

ఉషాదయాళ్, జిల్లా వ్యవసాయ అధికారిణి



జిల్లాలో మొత్తం 26 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు పరిశీలన బృందాలతో కేంద్రాలను తనిఖీలు చేయించాం. పరిశీలిన బృందాల తనిఖీల ఆధారంగా పూర్తి స్థాయి నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాం. జిల్లాలో ఎక్కడా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో ప్రైవేటు లైసెన్స్‌తో ఎరువుల అమ్మకాలు కొనసాగుతున్నట్లు తనిఖీల్లో గుర్తించ లేదు.

వీరభద్రస్వామి జాతరను సక్సెస్ చేయాలి

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాటోతు రాంచంద్రునాయక్

కురవి, మార్చి 3 : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 7 నుంచి జరిగే కురవి వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కురవి వీరభద్ర స్వామి దేవాలయంలో ఆదివారం జాతర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురవి జాతర కోసం ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ మాలోతు నెహ్రూనాయక్, అంబటి వీరభద్రం, ఈవో సత్యనారాయణ, కొర్ని రవీందర్, బలగాని శ్రీనివాస్, ఎస్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, రామునాయక్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ ఖరారు



చైర్మన్ రవీందర్‌రెడ్డి

కురవి, మార్చి 3 : కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి దేవాలయ మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ ఖరారైంది. ఈ నెల 7 నుంచి 23 వరకు 16 రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. దేవాలయ చైర్మన్‌గా కొర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలుగా బాలగాని శ్రీనివాస్, కుదురుపాక ఉప్పలయ్య, బండెల సంజీవరెడ్డి, దొంగల జనార్ధన్‌రెడ్డి, భూక్య బక్ష, గద్దెల బిక్షపతి, చిన్నం గణేష్, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య సక్రు, గుగులోతు సోమ్ల, వెంపటి శ్రీను, తెగుళ్ల వెంకటేష్, కాసుల మల్లికార్జున్‌లను నియమించారు. దేవాదాయశాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడ్డాక ఇదే కమిటీ అధికారికంగా కొనసాగనుంది.

గులాబీకి ఝలక్..!

(3వ పేజీ తరవాయి)

సిద్ధమవుతుండడం పార్లమెంట్ ఎన్నికల వేళ గులాబీ పార్టీలో కుదుపుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్యూలో మేయర్ సహా 18 మందికి పైగా కార్పొరేటర్లు..

గులాబీ ఏలుబడిలో ఉన్న వరంగల్ మహానగర పాలిక సైతం హస్తగతం కానుంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు గత నెలలో కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. తాజాగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్‌కు పయనం అయ్యారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్లు హస్తం గూటికి చేరనున్నారు. అయితే పలువురు కార్పొరేటర్లు మంత్రి సురేఖ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి సైతం తన అనుచర కార్పొరేటర్లతో కలిసి ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రతిపాదనలు చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలను మేయర్ చేరికపై చర్చించినట్లుగా సమాచారం. మేయర్ సుధారాణి చేరికపై కార్పొరేటర్ల నుంచి వ్యతిరేకత వస్తే తప్ప మేయర్‌తో పాటు సుమారు 18 మందికి పైగా కార్పొరేటర్లు రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నా యి. మొత్తానికి వరంగల్ మహానగర పాలిక కూడా హస్తం పాలనలోకి రానుంది. ఇది బీఆర్ఎస్‌కు బిగ్ షాక్‌గా రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కాగా, ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మేయర్ సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరంగల్ నగర అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్టు తెలి పింది. కానీ, ఆమె త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

హస్తం గూటికి వర్ధన్నపేట చైర్‌పర్సన్..

వర్ధన్నపేట మునిసిపాలిటీ హస్తగతం అయింది. ఇటీవలే బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాగా, ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అరుణతో పాటు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణలు కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సైతం కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వచ్చిన రవీందర్‌రావు పార్టీ మార్పుపై తన అనుచరులతో అంతర్గతంగా చర్చించారు. చాలా మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు మొగ్గు చూపినట్లుగా సమాచారం. అయితే బీఆర్ఎస్ అధిష్ఠానం ఒత్తిడితో చేరిక విషయంలో ఆలస్యం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల లోపు రవీందర్‌రావుతో పాటు మరికొంత మంది నేతలు హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది.

నాల్గవ రోజు మేడారం హుండీల లెక్కింపు

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు వరుసగా నాల్గవ రోజు ఆదివారం కూడా ప్రశాంతంగా కొనసాగింది. లెక్కింపులో భాగంగా నాల్గవ రోజు 88 హుండీలను తెరిచారు. వీటి ద్వారా రూ.71,67,000 ఆదాయం సమకూరిందని మేడారం సమ్మక్క సాలరమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హుండీల లెక్కింపు ద్వారా మొత్తం ఆదాయం రూ.10,32,03,000 చేరుకున్నది. ఇప్పటి వరకు 405 హుండీలను లెక్కించడం పూర్తయింది. ఇంకా 113 హుండీలను లెక్కించాల్సి ఉంది. వీటిని సోమవారం లోగా లెక్కిస్తారు. ఆదివారం హుండీల్లో నగదు, నాణాలతో పాటు విదేశీ కరెన్సీ, బంగారం వెండి కానుకలు కూడా బయటపడ్డాయి. వెండి, బంగారు కానుకలను ప్రత్యేక హుండీలో భద్రపరుస్తున్నారు.

ఇక్కడంతా వైవిధ్యమే..

- వీరన్న దేవాలయంలో అరుదైన సంప్రదాయం
- శివరాత్రి నుంచి నెలరోజుల పాటు జనజాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి సీఎంల మొక్కులు.. దర్శనాలు

కురవి వీరభద్రుడికి నారికేళాలు.. భద్రకాళి అమ్మవారికి జంతు బలులు



కురవిలో భద్రకాళి సమేత వీరభద్రుడు

మహబూబాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కోరిన వారికి కోటి వరాలిచ్చే దైవంగా విరాజిల్లుతున్న మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి దేవాలయం వైవిధ్యభరితమైన సంప్రదాయాలతో విలసిల్లుతోంది. భద్రకాళి సమేత వీరభద్రుడిగా భక్తుల కోర్కెలు తీర్చే దైవాలుగా, ఏటేటా మహాశివ రాత్రి నుంచి నెల రోజుల పాటు నిర్వహించుకునే జాతర ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీవారైనా వీరభద్రుడికి మాత్రం నారికేళ (కొబ్బరికాయ)లు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఆలయానికి వెలుపల నిర్మించిన ప్రహరీ వెలుపల భద్రకాళి అమ్మవారికి జంతు (కోళ్లు, యాటపోతుల) బలులతో మొక్కులు తీర్చుకోవడం అనాదిగా వస్తోంది. నెలరోజుల పాటు కొనసాగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే భక్తజనం మొక్కులు కూడా వైవిధ్యంగానే ఉంటాయనడానికి ఈ ఆలయమే నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రులుగా కొనసాగిన నారా చంద్రబాబునాయుడు, దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిలతో పాటు తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే బంగారు మీసాలు సమర్పిస్తానని మొక్కుకున్న పూర్వ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ ఆలయాన్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు విడతల వారీగా మంజూరు చేశారు.

చరిత్ర పుటల్లో కురవి వీరన్న..

ప్రాచీనాంధ్ర చరిత్రలో కాకతీయ ప్రభులది ప్రత్యేక స్థానం ఉందనడంలో అతిశయోక్తి లేదు. కాకతీయుల సామ్రాజ్యం అత్యంత వైభవంగా వెలుగొందిన 12వ శతాబ్దంలో కాకతీయుల కళాపిపాసకు, కళల పోషణ అభిరుచికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, ఇలాంటి దేవాలయాలు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఈ కోవలోనిదే.. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం. పుణ్యక్షేత్రాలతో విలసిల్లుతూ.. ఈ మండలం చారిత్రక పర్యాటక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ కురవి ఆలయాన్ని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ప్రతీ సంవత్సరం తరలివస్తున్నారు. సికింద్రాబాద్, విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో కురవి ఉంది.

చారిత్రక ప్రాధాన్యంతో కురవి..

కురవి ఒకప్పుడు మహోన్నత దశను అందుకున్న నగరంగా పేరుగడించింది. క్రీ.శ 850 ప్రాంతంలో తూర్పు చాళుక్యులతో ముఖ్యుడైన గునగ విజయాదిత్యుడు వేంగి (ఏలూరు)ను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. వేంగి చాళుక్యుల కాలంలో చోళరాజులతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఇందుకు నిదర్శనంగానే రాజరాజ చోళుని కుమార్తెను రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న విమలాదిత్యుడు వివాహం చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. సదరు విమలాదిత్యుడు కుమారుడే రాజరాజ నరేంద్రుడు ఆ కాలంలో తమిళ దేశపు ద్రావిడ సంస్కృతిని ప్రతిబింబించే విశిష్టాద్వైత ప్రబంధాలు వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ్య ఆంధ్రీకరించాడు. ఈ నేపథ్యంలోనే అనేక తెలుగు కుటుంబాలు తమిళ దేశానికి తరలివెళ్లాయి. అప్పట్లోనే వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజులలో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమ రాజు ప్రస్తుత ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఆ కాలంలోనే శ్రీవీరభద్రేశ్వరి కురవి ఆలయాన్ని నిర్మించినట్లు శిలాశాసనాల ద్వార తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన 1వ బేతరాజు పునరుద్ధరించారు. తరువాత కాలంలో రెండో బేతరాజు కురవి చెరువును తవ్వించినట్లు అనేక ఆధారాలున్నాయి. తూర్పు చాళుక్య రాజైన శ్రీవీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్లు విదేశీ యాత్రికుడు మార్కోపోలో తన రచనల్లో పేర్కొన్నాడు. శ్రీవీరభద్రుడి దేవాలయం చుట్టూ కురవి పట్టణ ప్రాంతం ఏర్పడినట్లు వేంగి చాళుక్యుల రెండో రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి, సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎనలేని వైభవాన్ని చవి చూసినట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది.

శివరాత్రి నుంచి ఉగాది వరకు..

భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి కురవి జాతర ఏటేటా మహాశివరాత్రి రోజున ఆరంభమై నెలరోజుల పాటు కొనసాగి, ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ కాలంలో వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. శివరాత్రి పర్వదినం వెళ్లిన తెల్లవారుజామున శ్రీవీరభద్రేశ్వరుడి కల్యాణం భద్రకాళి అమ్మవారితో జరుగుతుంది. స్వామిని కొలిచే భక్తుల్లో ఎక్కువగా బంజార గిరిజన లంబాడాలే ఉండడం విశేషం. జాతర సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం దేవాదాయశాఖ అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. శివరాత్రికి వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతుంది.



వీరభద్రుడి సన్నిధిలో నారికేళాలు సమర్పించుకుంటున్న భక్తులు



మహబూబాబాద్ జిల్లా కురవి దేవాలయం

తొలుత స్వామి ఒక్కడే.. ఆపై

కురవిలో తొలుత వీరభద్రస్వామి ఒక్కరే ఉండేవారని, సుమారు 150 ఏళ్ల కిందట భక్తులు తాము చేసిన తప్పొప్పులను ఆలయ ప్రాంగణంలోకి రాగానే వీరభద్రుడే పూనకాల ద్వారా భక్తుడి నోటివెంట నిజాలు చెప్పించేవారని నమ్మకాలు ఉండేవని చెబుతున్నారు. దీంతో అనేక కుటుంబాలు విడిపోవడం లాంటి అనర్థాలు జరిగాయట. ఆ క్రమంలోనే ఉగ్రరూపుడైన వీరభద్రుడి రౌద్రాన్ని తగ్గించడానికి అమ్మవారిని తీసుకురావాలనే ఆలోచన భక్తులకు కలిగిందట! ఫలితంగా భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇదే ఆలయంలో వీరభద్రుడి పక్కన ప్రతిష్ఠించారని ప్రతీతి. అప్పట్నుంచి ప్రతీ శివరాత్రి ఈ ఇరువురికి కల్యాణం జరుగుతోంది. అయితే తనకు నారికేళాలు కాదని, బలులు కావాలని, ప్రత్యేక ఆలయం కట్టించాలని ఓ భక్తుడి కలలో అమ్మవారు కన్పించి కోరిందంట.. ఆపై వీరభద్రుడి ఆలయానికి సమీపంలోనే ప్రత్యేకంగా భద్రకాళి ఆలయాన్ని నిర్మించారు. ఈ అమ్మవారు స్వయంభూ అవతారమన్న వాదన కూడా ఉంది. ఏదేమైనా అప్పట్నుంచే ఇటు వీరభద్రుడికి నారికేళాలు సమర్పించుకునే భక్తులు, భద్రకాళి అమ్మవారి ప్రత్యేక ఆలయంలో జంతుబలులు ఇస్తూ వస్తున్నారు.

హక్కుల పోరాట యోధుడు 'నల్లెల'

సంతాప సభలో వక్తల నివాళి

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కారుడు, పర్యావరణ ప్రేమికుడు, పౌర స్పందన వేదిక బాధ్యుడు, దివ్యాంగుల హక్కుల నాయకుడిగా నల్లెల రాజయ్య చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం, ఉమ్మడి వరంగల్ దివ్యాంగ సంస్థల ఆధ్వర్యంలో నల్లెల రాజయ్య సంతాప సభ ఘనంగా జరిగింది. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా రాజయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ పోరాటంలో, ప్రతీ ఉద్యమంలో మమేకమైన ఒకే వ్యక్తి రాజయ్య అన్నారు. మలిదశ ఉద్యమ పోరాటంలో అందరితో పాటు సమూహమై తిరిగి ఉద్యమంలో వలసదారుల ఆధిపత్యంపై నిప్పులు కురిపించారన్నారు. వరంగల్ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా అనేక పోరాటాలను నడిపించడంతో పాటు 20కిపైగా సంఘాలతో సాహిత్య సంపదను తీసుకువచ్చారన్నారు. దివ్యాంగుల హక్కులపై నిరంతరం గొంతెత్తాడని, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడిగా అనేక విధాలుగా పోరాటాలు కొనసాగించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ బన్నా ఐలయ్య, దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే హబీబ్ మియా, లక్ష్మయ్య, బోనగిరి రాములు, డాక్టర్ లక్కిరెడ్డి సత్యం, శంకర్ నాయక్, తిరుపతి, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, రామలక్ష్మి, డబ్ల్యువో కె మధురిమ, మెప్మా ఎండీ అంబటి రాజేందర్, ఎన్‌టీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్, పౌర స్పందన వేదిక అధ్యక్షుడు కె శంకర్‌రావు, పింగిళి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామల, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, ఆత్మకూరి రామకృష్ణ, వల్లపురెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లెల రాజయ్యకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అలరించిన డాగ్ షో



కాశీబుగ్గ జంక్షన్, మార్చి 3 : కాకతీయ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ డాగ్ షో చూపరులను ఎంతగానో అలరించింది. డాగ్ షోలో తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 35 రకాల జాతులకు చెందిన శునకాలను డాగ్ షోలో ప్రదర్శించడానికి తీసుకొచ్చారు. పది రౌండ్లు నిర్వహించిన పోటీల్లో శునకాలు, వాటి యజమానులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. వరంగల్ నగరం నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. బహుమతులు గెలుచుకున్న శునకాలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డాగ్ షో నిర్వాహ కులు వి.రమణారెడ్డి, కె.రామస్వామి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొలువుదీరిన దామేశ్వరుడు

ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం

దామెర, మార్చి 3: దామెర మండల కేంద్రంలో ప్రాచీన శివాలయం(దామేశ్వరాలయం)లో మూడు రోజుల పాటు నిర్వహించిన పునఃప్రతిష్ఠాపనోత్సవాలు వైభవోపేతంగా జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితుల వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. గన్నవరం భువనేశ్వరీ పీఠాధీశ్వరులు కమలానంద భారతీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో అమ్మవార్లకు మంగళసూత్రంతో పాటు మెట్టెలను కోట రాంరెడ్డి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా శివం టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి దంపతులు, ముద్దసాని సహోదర్‌రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోలం కృపాకర్‌రెడ్డి, గురిజాల శ్రీరాంరెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, వద్దిరాజు సత్యనారాయణరెడ్డి, గరిగె కల్పనకృష్ణమూర్తి, దామెరుప్పుల శంకర్, మేరుగు కుమారస్వామి, గడ్డం సదానందం, గంగిడి రాజేందర్‌రెడ్డి, నండెసారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

దామేశ్వరాలయం(శివాలయం)లో ఆదివారం శివలింగ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా స్వామివారికి యాగశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజాదికాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట దామెర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, నదిరం పోచయ్య, హింగె నాగేశ్వర్‌రావు, దురిశెట్టి భిక్షపతి, శనిగరం సుధాకర్, నల్ల సుధాకర్ ఉన్నారు. పునఃప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించినవారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు వంగాల సమ్మిరెడ్డి, రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీడీవోపీ) సత్యనారాయణ, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మల్లాడి శ్రీరాంరెడ్డి, సంఘ్ సంచాలక్ పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, గణేష్, లంక రాజారాంరెడ్డి హాజరయ్యారు.

నాటక రంగాన్ని బతికించాలి..

టీవీ, సినిమా మోజులో పడిన జనం..

డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ఘనంగా ప్రారంభమైన నాటక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 3 : భారతీయ సాంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి, నాటక రంగంగాన్ని బతికించి, భావితరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ నగర మాజీ మేయర్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఆదివారం రాత్రి వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో 50వ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీల ప్రారంభోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాసమితి అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షత జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథి స్వర్ణ మాట్లాడుతూ పూర్వం నాటికలకు ఆదరణ లభించేదని, ప్రస్తుతం సినిమాలు, టీవీ మోజులో పడి నాటక రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలను రూపుమాపేలా ఇతివృత్తాలను ప్రోత్సహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావానికి అహర్నిశలను కృషి చేస్తున్న భారతీయ కళాసమితి సేవలు ప్రశంసనీయమన్నారు. అంచెలంచెలుగా ఎదిగి స్వర్ణోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. ఎంపీపీ అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అంచెలంచెలుగా ఎదిగి 50వ ఉభయ రాష్ట్రాల పరిధిలో నాటికలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కళలను ప్రోత్సహించి విదేశీ సంస్కృతిని పారద్రోలాల్సిన అవసరం ఉందన్నారు. నాటక ప్రారంభోత్సవానికి ముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అందరిని ఎంతగానో అలరించింది.

పట్టణంలో శోభాయాత్ర..

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాట పోటీలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అంబేద్కర్ సెంటర్ నుంచి నాటక కళా సమితి వరకు కళాకారులతో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర అందరిని అలరింపజేసింది. అనంతరం భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.



నాటకోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

ఆకట్టుకున్న నాటికలు..

తొలి రోజు ఆదివారం రెండు నాటక ప్రదర్శనలు నిర్వహించగా ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మొదట తెలుగు కళా సమితి విశాఖపట్టణం వారి నిశ్శబ్దమా- నీ ఖరీదెంత నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో.. అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు, కష్టాలను, కన్నీళ్లను అనుభవిస్తున్న వాళ్లకు ఎంత వరకు ఉపశమనం కలిగిస్తుందో తెలియదుగానీ కొందరు ఇచ్చిన తప్పుడు రిపోర్టు కారణంగా కత్తి కన్నా పదునైన చట్టాన్ని దుర్వినియోగపర్చడం జరుగుతోందని ఈ నటకంలో కళ్లకు కట్టినట్టు రక్తికట్టించారు. వామన్‌రావుగా జి.కన్నబాబు, కుమార్‌గా వరప్రసాద్, పల్లవిగా డి.హేమ, ఎస్ఐ పాపారావుగా బీవీ.ప్రసాద్‌రావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావుగా ఇ.రాంబాబు, అనూరాధగా లాస్య తమ పాత్రలకు తమ అద్భుత నటనతో ఆకట్టుకున్నారు.

రెండో నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన రాజు గారి గోచి నాటకం విశేషంగా ఆకట్టుకుంది. కథలోకి వెళ్తే.. ఓ చిన్న దీవి. జనాభా కేవలం ఆరువేలు. వారి నుంచి పన్నులు పిండే పాలకులు సరదాలకు చాలక పేదల శ్రమని దోచుకునేందుకు జూదశాలను ఏర్పాటు చేస్తారు. దాని వల్ల ఓ హత్య జరుగుతుంది. హంతకుడికి రాజు ఉరి శిక్ష వేస్తాడు. ఉరిని అమలు చేయలేక దానిని జైలుశిక్షగా మారుస్తారు. వాడికి ముప్పూటలు భోజనం, కాపల భటుడు, ఆ చిన్న ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారుతుంది. అంతర్లీనంగా రాజుని, పాలనను ఎలాగైన దారినపెట్టేందుకు చేసే ప్రయత్నమే ఈ కథ. నేర విచారణ, నేరస్తుడికి శిక్ష కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితుల్ని ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే ఈ నాటకం ఉద్దేశం. పాత్రధారులు తమ పరిధి మేరకు చక్కగా నటించి విశేషంగా ఆకట్టుకున్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనకు ఆమోదం

కరీమాబాద్, మార్చి 3 : అండర్ రైల్వేగేటు శంభునిపేట ప్రాంతంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన విషయమై ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులు, కాలనీల ప్రజలు ఆమోదం తెలిపారు. ఆదివారం శంభునిపేటలోని అన్ని వర్గాల ప్రజలతో హనుమాన్ సమేత శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గ్రామ దేవత బొడ్రాయి సమావేశాన్ని నిర్వహించారు. శంభునిపేట, విశ్వనాథ్‌కాలనీ, బుడగజంగాల కాలనీ, గిరిప్రసాద్ నగర్, గణేష్ నగర్, నాగేంద్రనగర్, శ్రీరామనగర్, ఎంఎంనగర్, పలు కాలనీల అధ్యక్షులు, కాలనీ వాసులు, ముస్లిం పెద్దలు సమావేశానికి హాజరయ్యారు. శాస్త్రబద్ధంగా, స్థాన బలం ఉన్న దగ్గరే బొడ్రాయిని ప్రతిష్ఠించడం గ్రామానికి మంచిదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవులపెల్లి దయాకర్, కర్నె రవీందర్, పసునూటి కోటేశ్వర్, కందికొండ మోహన్, కోమాకుల పూర్ణకుమార్, పస్తం భిక్షపతి, రాజారాం, మదారి చేరాలు, శబ్బీర్, ఎల్లయ్య, సత్యనారాయణ, కత్తి ఎల్లగౌడ్, గుగులోతు విజయ్, మంతెన సునీత పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి సామూహిక వ్రతం



దత్తక్షేత్రంలో సామూహికంగా వ్రతంలో పాల్గొన్న భక్తులు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 3 : అష్టసిద్ధులతో కూడిన అనఘాదేవి - అనఘాస్వామిల వ్రతాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతంతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని దత్తప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం మాఘ మాసం బహుళ అష్టమి పర్వదినం సందర్భంగా వందలాది మంది భక్తులచే శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో భక్తులందరి చేత అనఘాష్టమి వ్రతాలను ఆచరింప చేశారు. ఈ సందర్భంగా శరత్ కంటి ఇనిస్టిట్యూషన్ దత్తక్షేత్రంలో ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 200 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అనంతరం 400 మందికి అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, డాక్టర్ శార్వాణి, చకిలం ఏకాంబరం, విజేందర్‌రెడ్డి, జూలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత లింగమూర్తికి నివాళి



లింగమూర్తి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రకాష్

గిర్మాజీపేట, మార్చి 3 : కార్మికుల కోసం తుదివరకు పోరాడిన నేత, ఐఎఫ్‌టీయూ జాతీయ నేత కూరపాటి లింగమూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలని విధానమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. ఆదివారం రాత్రి చార్‌బౌళి పద్మశాలి భవన్‌లో ప్రింటింగ్ బైండింగ్ ప్రెస్ వర్కర్స్ యూనియన్, లింగన్న మిత్ర బృందం ఆధ్వర్యంలో కేయూ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ జి.చంద్రమౌళి అధ్యక్షత లింగమూర్తి సంస్మరణ జరిగింది. ముఖ్యఅతిథి ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం ద్వారా విప్లవ రాజకీయాల్లోకి వచ్చిన ఆయన ఆజంజాహి మిల్లు, బీడీ, ప్రింటింగ్ అండ్ బైండింగ్, హోటల్ వర్కర్స్, కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేపట్టి కార్మికుల హక్కులను సాధించాడన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.దయాకర్, డాక్టర్ తౌటం భాస్కర్, కార్మిక నాయకులు సదానందం, ఆరెల్లి కృష్ణ, ఎస్.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చుక్కల మందు

కరీమాబాద్, మార్చి 3 : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం 42వ డివిజన్‌లో నిర్వహించారు. రంగశాయిపేటలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, ఎలుగు సుజాత, రాజ్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు. శాంభవి సంక్షేమ మండలి ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు మాడిశెట్టి కవిత, ప్రధాన కార్యదర్శి రాధిక, కోశాధికారి అమరావతి, కవిత, బక్కి రమాదేవి పాల్గొన్నారు. విశ్వనాథ్‌కాలనీలో కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● వరంగల్(సంగెం): ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి వేయించాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి అన్నారు. సంగెంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ ఉదయ్, ఎంపీటీ మల్లయ్య, మాజీ సర్పంచులు నరహరి, బాబు, రమేష్, రాజు, మోహన్ పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా పల్స్ పోలియో

● వరంగల్(మామునూరు): మామునూరులో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో పైడిపల్లి హెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ ఖాసీం, కల్పన, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షురాలు సింగారపుభాగ్యమ్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర అనిల్, బీసీ నాయకులు కావటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 టీంల ద్వారా 3,350 మందికి పోలియో చుక్కలు వేశారు. గీసుగొండలో ఎంపీపీ భీమగాని సౌజన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: నగరంలోని మూడో డివిజన్ పైడిపెల్లిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి అనిల్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు చుక్కలు వేసి పల్స్ పోలియోను ప్రారంభించారు. అలాగే ఆరెపల్లిలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు.

● ఖిలావరంగల్: నిండు ప్రాణానికి రెండు చుక్కలతో, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్ అన్నారు. తూర్పుకోటలోని సెంటర్‌లో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల వయస్సువరకు ఉన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అచ్చ లక్ష్మి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంగరబోయిన విజయ్, ఏఎన్ఎం రాణి, శిరీష, మెడికల్ సాబ్బంది మాదవ్, రాధిక, రజిత, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే శివనగర్ 34వ, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ళ శ్రీనివాస్, 35వ, డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు శ్రీరాం రాజేష్ పాల్గొన్నారు.



రంగశాయిపేటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్



గీసుగొండలో పోలియో చుక్కలను వేస్తున్న సౌజన్య



సంగెంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ కళావతి



మామునూరులో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ అరుణ విక్టర్



ఖిలావరంగల్‌లో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సువర్ణసురేష్

గురుధామ్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, మార్చి 3 : సమాజ హితం కోసం శివానంద గురు కల్చరల్ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. పైడిపెల్లిలోని గురుధామంలో (సప్తధామ్) ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భక్తి మార్గాలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమనిన్నారు. సుమారు 400 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్, బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, రేపాల రాంచందర్, ఉమాశంకర్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

శివపార్వతుల కల్యాణం కరపత్రాల ఆవిష్కరణ

వరంగల్ టౌన్, మార్చి 3 : కాశిబుగ్గ ఎల్బీనగర్ హిందూ ముక్తిస్థల్‌లో ఆదివారం ముక్తిస్థల్ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ నెల 7న జరుగనున్న శివపార్వతుల కల్యాణానికి సంబంధించిన కరప్రతాలను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు బూర రామచందర్ రావు మాట్లాడుతూ.. హిందూ ముక్తిస్థల్‌లో ఏటా శివరాత్రికి ముందు రోజు శ్రీలక్ష్మి-నారాయణ శ్రీ శివపార్వతుల(వటవృక్ష) కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాడాల నర్సింహరావు, శీలం బాబూరావు, వంగరి భాస్కర్, గోసిగొండ సుధాకర్, గోరంటాల రాజు, గుమలాపురం ఉప్పలయ్య, గాదె ప్రభాకర్, మార్గం ఎల్ల య్య, ఆకెన వెంకటేశ్వర్లు, ఉప్పుల రమేష్ పాల్గొన్నారు.

డాక్టర్ తేజశ్రీకి సత్కారం

ఖిలావరంగల్, మార్చి 3: ఇటీవల అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాలలో బీఏఎంఎస్ టాపర్‌గా నిలిచిన బుదారపు తేజశ్రీని ఆదివారం శివనగర్‌లో మహాలక్ష్మి విహారపరపతి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శామంతుల భిక్షపతి, బుదారపు భాస్కర్, సాంబమూర్తి, కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

ఆగ్రోస్‌పై ఆరా!

(3వ పేజీ తరువాయి)

అధిక భాగాన్ని సరఫరా చేస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా 60శాతం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు 20శాతం, మరో 20శాతం ప్రైవేటు డీలర్లకు ప్రభుత్వం కేటాయిస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు ఎరువులు పంపిణీ చేస్తున్నారు. కొన్ని సొసైటీలు డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో రైతులు ఎరువుల కోసం ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఆగ్రోస్ కేంద్రాలకు మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు కేటాయిస్తే రైతులకు ఆగ్రోస్ కేంద్రాలు మెరుగైన సేవలు అందించే అవకాశం పునఃప్రారంభమవుతుంది.

మండలాల వారీగా ఆగ్రోస్ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 26 ఆగ్రోస్ కేంద్రాలు ఉన్నాయి. చెన్నారావుపేట, సంగెం, ఖానాపురం మండలాల్లో ఒక్కో కేంద్రం ఉంది. అలాగే వరంగల్, ఖిలా వరంగల్, వర్ధన్నపేట, గీసుగొండ,నెక్కొండ, దుగ్గొండి మండలాల్లో రెండు కేంద్రాల చొప్పున ఉన్నాయి. పర్వతగిరి, నల్లబెల్లి, నర్సంపేట, రాయపర్తి మండలాల్లో మూడేసి ఆగ్రోస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

అభయహస్తం హామీలను అమలు చేస్తాం

▸▸ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 3: అభయహస్తం కింది ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం గృహజ్యోతి కరెంటు జీరో బిల్లులను లబ్ధిదారులకు కొనాయిమాకులలో అందచేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 200యూనిట్‌ల లోపు మాత్రమే ఉచిత కరెంటు లభిస్తుందన్నారు. ఈనెల 11 నుంచి ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభిస్తామని చెప్పారు. కొనాయిమాకులలో పెన్షన్‌లు ఇచ్చేలా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. గతంలో అభయహస్తం పథకాల కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ భిక్షపతి, ఏడీ నరసింహరావు, ఎంపీడీవో కృష్ణవేణి, ఏఈ సంపత్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు రహీంపాష, ఎంపీటీసీ వీరారావు, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలను అందిస్తాం

వరంగల్(సంగెం): అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం గవిచర్లలో గృహజ్యోతిలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ జీరో బిల్లు పథకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 గ్యాస్ అందించడంతో పాటు పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల విలువైన వైద్యంతో పలు పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. సంగెం మండలానికి సుమారు రూ.9కోట్ల విలువ కలిగిన విద్యుత్‌ను అందించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. గవిచర్ల- సంగెం రోడ్డును పునరుద్ధరించే బాధ్యతను తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కందకట్ల కళావతి, గ్రామ ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, రాంచంద్రాపురం ఎంపీటీసీ చిదురాల రజీత,విద్యుత్ శాఖ ఎస్ఈ పి. మధుసూదన్‌రావు, డీఈ భిక్షపతి, విద్యుత్ శాఖ అధికారులు సంజీవరావు, నర్సింహరావు, ఎంపీడీవో రవీందర్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి పాల్గొన్నారు.



కొనాయిమాకులలో లబ్ధిదారుకు జీరో బిల్లు అందచేస్తున్న ఎమ్మెల్యే

ఇటుకబట్టి కార్మికుడి ఆత్మహత్య

వరంగల్(సంగెం), మార్చి 3 : బతుకు దెరువు కోసం వచ్చిన ఇటుక బట్టి కార్మికుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనంప్రకారం.. సంగెం మండలం ఆశాలపల్లి శివారులోని ఇటుకల బట్టిలో ఒడిస్సా రాష్ట్రం బలంగిర్ జిల్లా పాట్నాగర్ మండలం బూచెపల్లి గ్రామానికి చెందిన కలకాను పుటేల్(62) కుటుంబం వలస వచ్చింది. శనివారం కూలి డబ్బులు రావడంతో పుటేల్ మద్యం తాగాడు. దీంతో భార్య మందలించడంతో ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగా రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా వేపచెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు ఉమకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతుడికి కుమారుడు, భార్య ఉన్నట్లు సంగెం ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు



పుటేల్ మృతదేహం

మంటల్లో కాలి మృతి చెందిన వృద్ధుడు

గీసుగొండ, మార్చి 3 : ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు నిప్పంటుకుని మంచంలోని మృతిచెందిన ఘటన ఆదివారం అనంతారంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ధనేకుల నరసింహరావు(70)కు భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 40 ఏళ్ల క్రితం భార్య, పిల్లలను నరసింహరావు వదిలి వెళ్లిపోయాడు. కొద్దినెలల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందగా అనంతారంలోని ఇంటికి వచ్చాడు. అంత్యక్రియల అనంతరం గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న చర్చికి సంబంధించిన చిన్న గదిలో ఉంటున్నాడు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పెద్ద కుమారుడు రామానుజం పోషణ కోసం నెలనెలా డబ్బు పంపిస్తున్నాడు. ఇటీవల నరసింహరావు కిందపడగా కాలువిరిగింది. దీంతో గ్రామంలో ఉంటున్న చిన్న కుమారుడు శ్రీనివాస్ వద్ద ఉంటున్నాడు. అతడే పోషణ చూస్తున్నాడు. ఆదివారం ఉదయం అతనికి ఆహారం ఇచ్చేందుకు చిన్న కోడలు వెళ్లగా మంచంతోపాటు నరసింహరావు శరీరం మొత్తం కాలి కనిపించింది. అయితే, నరసింహరావుకు బీడీలు తాగే అలవాటు ఉండటంతో ప్రమాదవశాత్తు బీడీ నిప్పు మంచానికి అంటుకొని కాలి మృతిచెంది ఉంటాడని కుమారుడు పోలీసులకు వెల్లడించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.




నరసింహారావు (ఫైల్)

రెండు మట్టి లోడ్ టిప్పర్లపై కేసు

వరంగల్(సంగెం), మార్చి 3: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సంగెం పోలీసులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగెం హెడ్ కానిస్టేబుల్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా తిమ్మాపురంలో రెండు మట్టి లోడ్ టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. తీగరాజుపల్లి వైపు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రెండు మట్టి లోడ్ టిప్పర్లు మట్టి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుల ఎన్నిక

కరీమాబాద్, మార్చి 3: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 41, 42 డివిజన్ బీజేపీ అధ్యక్షులను ఆదివారం నియమించారు. 41వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా కర్నె వాసుదేవ్, 42వ డివిజన్ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి అర్జున్‌లు నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠాన ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. తమ నియామకానికి సహకరించినజిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అర్జున్, వాసుదేవ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



కర్నె వాసుదేవ్, తాళ్లపెల్లి అర్జున్

ఖమ్మం సభకు తరలిన నాయకులు

ఖిలావరంగల్, మార్చి 3 : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, ఉపాధిని గాలికొదిలేసి, కార్పొరేట్, మతతత్వ శక్తులకు ఎర్ర తివాచీ పరుస్తోందని సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి ఆరోపించారు. ఆదివారం ఖిలావరంగల్ నుంచి ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభకు తరలివెళ్లారు. అలాగే 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభకు వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్ వరంగల్ జిల్లా నాయకులు అడ్డూరి రాజు, మైదం పాణి, పసునూరి రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింగరావు, రాష్ట్ర నాయకులు అలువాల నరేష్, కత్తుల కొమురయ్య, లింగన్న, జవహర్‌లాల్, ల్యాదళ్ళ ఎల్లయ్య, మోహన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వరంగల్ సిటీ, మార్చి 3: వరంగల్ నగరంలోని ఓ‌ప్రైవేటు హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆదివారం డైట్ 1978-79 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 50 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యక్రమం నిర్వాహకులు బేతి శంకరలింగం, కమిటీ సభ్యులు స్వర్ణలత, సుజాత, ప్రభాకర్‌రెడ్డి, పూర్ణయ్య, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు



పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చిన్నస్వామి

గీసుగొండ, మార్చి 3 : రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందరివాడని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి అన్నారు. అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ సమావేశం ఆదివారం గొర్రెకుంటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలకే పరిమితం కాకుండా ప్రతీ నెల రెండో ఆదివారం అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి గౌరవించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు ఇంద రాజ్‌కుమార్, నమిండ్ల కిరణ్, ల్యాదెల్ల చిన్ని, శ్రీనివాస్‌కృష్ణ, సతీష్, లక్ష్మీనారాయణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

8న ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం



సమావేశంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాకేష్‌రెడ్డి

గిర్మాజీపేట, మార్చి 3 : శివతత్వానికి ఆధ్యాత్మికతకు ఓరుగల్లు ప్రసిద్ధి గాంచిందని, ప్రతి ఏటా మాదిరిగానే మహాశివరాత్రి నాడు ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని హనుమకొండ హయగ్రీవచారి మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. శివపార్వతుల కల్యాణం, బ్రహ్మశ్రీ గంగాధర శాస్త్రీ, రాధామనోహర్‌దాస్ ప్రవచనాలు, సప్త హారతి, పేరిణిశివ తాండవం, సినీ సంగీత దర్శకులు, గాయకుల వందేమాతం శ్రీనివాస్, చరణ్ అర్జున్, జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో విశ్వహిందు పరిషత్ వరంగల్ మహానగర్ అధ్యక్షుడు బి.నాగరాజు, 2వ డివిజన్ కార్పొరేటర్ రవినాయక్, మహాశివరాత్రి కోఆర్డినేటర్ కత్తుల అభిషేక్, దీపక్, సుకాంత్, వేలేరు ఎంపీటీసీ భూపతి రాజు, అమరేష్, కొత్తపెల్లి రాజేష్, కె.క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ఎన్ఐఏను రద్దు చేయాలి

వర్ధన్నపేట, మార్చి 3 :ఎన్ఐఏ, సీబీఐ, ఈడీ దాడులను ఆపాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్‌చేశారు. వర్ధన్న పేట పట్టణ కేంద్రంలో ఆదివారం మునిగాల అరుణ్ అధ్యక్షతన జరిగిన దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ద్వారా ఉగ్రవాదాన్ని అరికట్టే పేరుతో కవులను, రచయితలను, ఎడిటర్లను, బీజేపీ వ్యతిరేక పార్టీల వారిని ఇబ్బందులు పెడుతూ దాడులు చేస్తున్నారని అన్నారు. హిందువుల ఓట్లు 79.80శాతం ఉన్నాయని, ఓట్లు దండుకోవడానికి అయోధ్య ముందుకు తీసుకొచ్చారని అన్నారు. ఎన్నికల్లో గెలవగానే కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. జిల్లాకో నవోదయ పాఠశాలకు అనుమతి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పలువురు దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, మార్చి 3 : రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నర్సం పేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో గృహజ్యోతి పథకాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదన్నారు. ప్రజలు గృహ జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్, డీఈ ఆర్.శ్రీధర్, ఎస్.సీ సంజీవరావు, ఏసీపీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• భజ్జుతండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నల్లబెల్లి: మండలంలోని భజ్జుతండాలో ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంతో గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి కొరత లేకుండా ఉంటుందన్నారు. వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని, గ్రామంలోని ప్రజలకు తాగునీరు కూడా అందుతుందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎమ్మెల్యే ప్రారంభించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు మధుసూదన్‌రావు, శ్రీధర్, అర్జీ, లక్ష్మణ్, రవళి, కాంగ్రెస్ మండల నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోతు రమేష్, వైనాల అశోక్, పెంతల కొమురరెడ్డి, మాలోతు చరణ్‌సింగ్, కడ్దూరి కట్టయ్య, డ్యాగల కృష్ణ, పురుషోత్తంసురేష్, బేతి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

నర్సంపేటటౌన్, మార్చి 3 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.డి.అబ్బాస్ అన్నారు.నర్సంపేటలో ఆదివారం సీపీఎం నియోజక వర్గ ముఖ్య నాయకులకు స్టడీ సర్కిల్ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడిచిపోతున్నప్పటికీ ఆకలితో ప్రతీ 11నిమిషాలకు ఒకరు చనిపోతున్నారన్నారు. ప్రజా సమస్యలను విస్మరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడం కోసం కేంద్రం ప్రైవేటీకరణ విధానాలను అవలంబిస్తున్నద న్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి 700 మంది రైతులను బలిగొన్న చరిత్ర బీజేపీకే ఉందన్నారు. ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు చింతమల్ల రంగయ్య, కుమారస్వామి, స్వామి, శ్రీధర్, ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కని స్పందన



నర్సంపేటలో చుక్కల మందు వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని



ఖానాపురంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు



పెర్కవేడులో చుక్కల మందు వేస్తున్న డాక్టర్ అనూష



వర్ధన్నపేటలో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ



పర్వతగిరిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ రాజు



దుగ్గొండిలో ఎస్సై పరమేశ్ పాపకు పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజు

నర్సంపేట, మార్చి 3 : ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల మందుకు ఆదివారం చక్కటి స్పందన లభించింది. పట్టణంలోని బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి, వడ్డెర కాలనీతోపాటు 24 వార్డుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు బాంజీపేట పీహెచ్‌సీ పరిధిలోని 34పల్స్ పోలియో కేంద్రాల్లో చిన్నారి బాలబాలికలకు పోలియో చుక్కలను వేశారు. పట్టణంలోని పలు కేంద్రాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్ పిల్లలకు పోలియో చుక్కలువేశారు, పోలియోకేంద్రాల వద్దకు తల్లి దండ్రులు చిన్నారులను తీసుకురాగా ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలువేశారు. 34 పల్స్‌పోలియో కేంద్రాలలో 4,150 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయా లనిలక్ష్యం కాగా, 4వేల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారులు తెలిపారు.

• ఖానాపురం : మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు చిన్నారులకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 33 సెంటర్లో 2,204 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్‌వో సుదార్‌సింగ్ సందర్శించి రికా ర్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి, వైద్య సిబ్బంది శ్యామ్, రామలింగయ్య, వేణుగోపాల్, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

• రాయపర్తి : నిండు జీవితానికి రెండు చుక్కల మందు ఎంతో అవసరమని రాయపర్తి ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించగా, తిర్మలాయపెల్లిలో ఎంపీపీ పాల్గొన్నారు. పెర్కవేడులో ఎంపీటీసీ బండి అనూష రాజబాబు, పీహెచ్‌సీ డాక్టర్ అనూషలు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే ప్రతీ ఒక్కరి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అలాగే పర్వతగిరి మండలంలో పల్స్‌పోలియో విజయవంతమైంది. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేశారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలను వేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆరోగ్యఉపకేంద్రాల వద్ద 0-5 సంవత్సరాల వయస్సు పిల్లల కు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

• దుగ్గొండి : మండలంలోని దుగ్గొండి, కేశవాపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం 2,507 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. మండలంలో 35 పోలియో చుక్కల కేంద్రాలు, 140 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోలియో చుక్కల నమోదు పర్యవేక్షణ డాక్టర్లు విజయ్‌కుమార్, కిరణ్‌రాజులు వ్యవహరించారు. తొగర్రాయిలో మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, వెంకటాపురంలో సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్ రెడ్డిలు ప్రారంభించారు.

• వర్ధన్నపేట: ఐదేళ్లలోపు చిన్నారులకు తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కల మందు వేయించాలని మునిసిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు తప్పనిసరి పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్ రెడ్డి, కౌన్సిలర్ తోటకూరి రాజమణి పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ సరోజ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో, బస్ స్టేషన్‌లో, జీపీ కార్యాలయాల్లో పోలియో చుక్కలను వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సరోజ పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. పోలియో చుక్కల కేంద్రాలను జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ సుధార్‌సింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు స్వరూప, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆశకార్యకర్తలు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

• తప్పిన ప్రమాదం • ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చెన్నారావుపేట, మార్చి 3 : నర్సంపేట డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ శివారులో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పాపయ్యపేట గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు ప్రతీ రోజు జోజేర్వు గ్రామానికి వెళ్లుతుంది. రోజు వారి మాదిరిగానే ఉదయం నర్సంపేట నుంచి బోజేర్వు గ్రామానికి ప్రయాణికులను తీసుకొని వెళ్లింది. తిరిగి 30 మంది ప్రయాణికులను తీసుకొని అదే బస్సు నర్సంపేటకు వస్తున్న క్రమంలో తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ శివారుకు రాగానే బస్సు రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బురదలో దిగబడింది. దీంతో బస్సులో ఉన్న ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. బస్సు ఎలాంటి పల్టీలు కొట్టకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్థులు గాయాలపాలైన వారిని 108 వాహనంలో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

బాపునగర్‌లో పూరి గుడిసె దగ్ధం

చెన్నారావుపేట, మార్చి 3 : మండలంలోరి బాపునగర్ గ్రామంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది, గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన డప్పు హనుమంతూ తన కుటుంబ సభ్యులతో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. రాత్రి సమయంలో ఎక్కడి నుంచో వచ్చిన నిప్పు రవ్వలు గుడిసెకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌తో పాటు బట్టలు, బియ్యం, సామగ్రి పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డి



నల్లబెల్లి, మార్చి 3 : బీజేపీ నల్లబెల్లి మండల అధ్యక్షుడిగా బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డిని నియామకం చేసినట్లు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. తన మీద ఉన్న నమ్మకంతో బీజేపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలను కల్పించినందుకు జిల్లా పార్టీకి ధన్యవాదాలన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి తీవ్రమైన కృషి చేస్తానన్నారు. అనంతరం నాయకులు గోగుల ప్రతాప్‌రెడ్డి, వడ్డేపల్లి నరసింహరాములు, రేసు శ్రీనివాస్, తడుక అశోక్‌లకు ధన్యవాదాలను తెలియజేశారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

రాయపర్తి, మార్చి 3: విద్యార్థులు మానసికంగా దృఢసంకల్పంతో ఉండాలని సైకాలజిస్టు సత్య అన్నారు. ఆదివారం పర్వతగిరి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు చిన్న విషయాలకే కుంగిపోకూడదని, ఏదైనా సమస్య ఉంటే వార్డెన్లు, తోటి విద్యార్థులకు చెప్పాలన్నారు. దేనికి కుంగిపోకుండా, ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్‌రెడ్డి, టీచర్ రాజేందర్, వార్డెన్ రవికుమార్, సిబ్బంది రాజు, సంతోష్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

200 యూనిట్ల విద్యుత్ మాఫీ బిల్లులు ప్రారంభం

దుగ్గొండి, మార్చి 3 : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతిలో భాగంగా 200యూనిట్ల మాఫీ బిల్లులను విద్యుత్ సిబ్బంది ఆదివారం ప్రారంభించారు. గ్రామాల్లో మీటర్లు ఉన్న ఇంటి యజమానుల ఇళ్లకు విద్యుత్ సిబ్బంది తిరుగుతూ విద్యుత్ మాఫీ బిల్లులు అందిస్తున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నల్లబెల్లి, మార్చి 3: మండల కేంద్రంలోని ఉదయశ్రీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2003-04 విద్యా సంవత్సర పదో తరగతి బ్యాచ్ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ఆలింగనం చేసుకున్నారు. చిన్ననాటి మధురమైన తీపి గుర్తులను నెమరెసుకున్నారు. నాటి గురువులకు పాదాభివందనం చేస్తూ, ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నారో వివరించారు. బ్యాచ్ వారికి ఎలాంటి కష్టమొచ్చినా అందరం కలిసి ఆదుకోవాలని అవగాహనకు వచ్చారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు సమ్మయ్య మల్లారెడ్డి, జయరాజ్, అజయ్, సాంబమూర్తి, కోటి, పూర్వ విద్యార్థులు సురేందర్‌రెడ్డి, సాంబరాజు, సురేష్, మధు, రాజేష్, స్వాతి, శ్వేత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్‌పై ఆరా!

(3వ పేజీ తరువాయి)

అధిక భాగాన్ని సరఫరా చేస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా 60శాతం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు 20శాతం, మరో 20శాతం ప్రైవేటు డీలర్లకు ప్రభుత్వం కేటాయిస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు ఎరువులు పంపిణీ చేస్తున్నారు. కొన్ని సొసైటీలు డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో రైతులు ఎరువుల కోసం ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తున్నారు. గతంలో మాదిరిగానే ఆగ్రోస్ కేంద్రాలకు మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు కేటాయిస్తే రైతులకు ఆగ్రోస్ కేంద్రాలు మెరుగైన సేవలు అందించే అవకాశం పునఃప్రారంభమవుతుంది.

• మండలాల వారీగా ఆగ్రోస్ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 26 ఆగ్రోస్ కేంద్రాలు ఉన్నాయి. చెన్నారావుపేట, సంగెం, ఖానాపురం మండలాల్లో ఒక్కో కేంద్రం ఉంది. అలాగే వరంగల్, ఖిలావరంగల్, వర్ధన్నపేట, గీసుగొండ, నెక్కొండ, దుగ్గొండి మండలాల్లో రెండు కేంద్రాల చొప్పున ఉన్నాయి. పర్వతగిరి, నల్లబెల్లి, నర్సంపేట, రాయపర్తి మండలాల్లో మూడేసి ఆగ్రోస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి.

ఎస్సైని కలిసిన నాయకులు

ఖానాపురం, మార్చి 3: ఖానాపురం ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై రఘుపతిని ఆదివారం బుధరావుపేట గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బుధరావుపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలకల మురారి, నగరబోయిన మహేష్, చెడిపాక వినోద్‌కుమార్, ఎండి నజీర్, సులేమాన్, వినయ్ పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : చెన్నారావుపేట మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గూడ అరుణ్‌కుమార్‌ను ఆదివారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మాజీసర్పంచ్‌లు కుండె మల్లయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండి హరీష్, అమీరుద్దీన్, జయరాజ్, మాజీ జడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపర్తి, మార్చి 3 : పర్వతగిరి ఏజీఎల్ పరిధిలోని పెద్ద తండా, సోమారం, జీపీ తండా ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



రవీందర్ (ఫైల్)

దుగ్గొండి, మార్చి 3: వ్యాపారంలో నష్టపోయి అప్పులపాలైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మహ్మదాపురంలో ఆదివారం చోటు చేసుకొంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం... మహ్మదాపురం గ్రామానికి చెందిన పాలడుగుల రవీందర్ (47)కు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవ సాయంతో పాటు గ్రామంలో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్తె వివాహం ఐదేళ్ల కిందట చేశాడు. పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ వ్యాపారంలో సుమారు గా రూ.50లక్షలు అప్పులు అయ్యాయి. ఇటీవలనే ఫర్టిలైజర్ షాపు నడిపే ఇల్లును అమ్మాడు. అయినప్పటికీ అప్పులు తీర లేదు. దీంతో రవీందర్ మనస్తాపం చెంది అమ్మిన ఇంటిలోనే శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యు లు నర్సంపేట ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకపోగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి చనిపోయాడు. ఆదివారం మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ వెల్లడించారు.

విద్యుత్ శాఖ నాయకుడికి సన్మానం



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

దుగ్గొండి, మార్చి 3 : మండలంలో విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విద్యుత్ శాఖ కార్మిక ట్రేడ్ యూనియన్ ఐఎన్‌టీసీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న గుండా శ్రీనివాస్‌ను ఆదివారం సర్ సీవీ అకాడమి (సేవా సంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం 28 ఏళ్ల ఉగాది మహోత్సవ సువర్ణ ఘంటా కంకణ గోల్డ్‌మెడల్స్ అవార్డుల సంబరాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవనంలో సన్మా నంచేశారు. శ్రీనివాస్ 1993లో ఉద్యోగంలో చేరి వృత్తి ధర్మాన్ని పాటిస్తూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో సైతం శ్రీనివాస్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వృత్తితో పాటు సామా జిక బాధ్యతగా వివిధ రకాల సేవా కార్యక్రమాలలో పాల్గొ న్నందుకు సర్ సీవీ సంస్థ అవార్డుతో పాటు సత్కరించడం అభినందనీయమన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

పత్తి కర్రతో ఎన్నో లాభాలు

పాటిస్తే పంటలకు మేలు

కంపోస్టు తయారీ పై దృష్టి సారించాలి



పత్తి చేను (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, మార్చి 3 : పత్తి పంట కాలం ముగియగానే రైతులు పత్తి కర్రను కాల్చివేస్తున్నారు. మరో సారి వేసే పంటపై దృష్టి పెట్టి చకచకా పనులు కావాలనే ఉద్దేశంతో కర్రను పూర్తిగా కాల్చి వేయడం వలన భూమికి సైతం ఇబ్బందులు ఏర్పడతాయి. పొలంలోనే వాటిని కాలబెట్టడం వలన రైతులకు తెలియకుండానే పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో పంటలకు కీడు చేసే కీటకాల సంతతి పెరిగి రైతులు నష్టపోతున్నారు. పత్తికర్ర వినియోగం పై అవగాహన కలిగి ఉంటే ఎన్నో లాభాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఇవీ ఉపయోగాలు..

కర్రను పెద్ద పెద్ద యంత్రాల్లో సైజును బట్టి నుజ్జు నుజ్జు చేసి ప్లైవుడ్ తయారు చేసుకోవచ్చు. ముఖ్యంగా దీని ద్వారా ప్యాకేజింగ్ పేపరు, అట్ట ముక్కలు పొడిగా మార్చి వర్మీకంపోస్టు తయారీ, ఎరువుల తయారీతో పాటు పశువుల దాణా తయారీకి వాడుకోవచ్చు. బయోమాయిశ్చర్ ద్వారా పత్తి కర్ర నుజ్జును పంట చేలలో చల్లితే తేమ ఆరనీయకుండా కాపాడుతుంది. కలుపు మొక్కలను నివారిస్తుంది. పుట్టగొడుగుల సాగులో దీనిని ఎరువుగా వాడుకోవచ్చు. పరిశ్రమల్లో, హోటళ్లలోని బాయిలర్లలో వీటి ఉపయోగం ఎక్కువగా ఉంటుంది.

యంత్రాలు లేక అవస్థలు...

గ్రామీణ ప్రాంత రైతులు పూర్తిగా వ్యవసాయ మీద ఆధారపడి ఉండడంతో పంట సమయ కాలానికి మధ్య పెద్దగా సమయం ఇవ్వరు. దీంతో కోసిన పంటను వెంటనే తీసివేసి మరో పంట వేయాలనే ఆతృత ఉంటుంది. పత్తి కర్రను కోసేందుకు యంత్రాలు లేకపోవడంతో సైతం రైతులు కర్రను అమ్ముకునేందుకు ఆసక్తి చూపడం లేదు. నూతనంగా వచ్చిన మల్టీ క్రాప్ శ్రడ్డర్ అనే యంత్రం గంటలోపే ఒక ఎకరంలోని పత్తి కర్రను నుజ్జు నుజ్జు చేసి చేనులోనే వెదజల్లుతుంది. అది సేంద్రీయ ఎరువుగా మారి భూ సారాన్ని పెంచుతుంది. దీంతో రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గి, అధిక దిగుబడికి దోహద పడుతుంది. ఈ యంత్రం ధర సుమారు రూ. లక్షన్నర వరకు ఉండడంతో రైతులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో కోసి కుప్పలు వేసి కాల్చడం భారమైనప్పటికీ భరిస్తున్నారు. కర్రను తొలగించేందుకు ప్రతీ రైతు దాదాపు రూ. 1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు చేస్తున్నాడు. గతంలో కొందరు పత్తి కర్రను ముడి చమురుగా వినియోగించుకునే యంత్రాల సహాయంతో వచ్చి తీసుకెళ్లేవారు. అలా రైతులకు కాస్తా లబ్ధి చేకూరేది. ఆసక్తి చూపకపోవడంతో కర్రను కాలుస్తున్నారు.

భూ సారాన్ని పెంచుకోవాలి

రాంనర్సయ్య, ఏవో వర్ధన్నపేట

ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న విధానంతో పత్తి కర్ర వృథాగా కాలిపోవడమే కాకుండా భూ సారం తగ్గుతోంది. నూతన పద్ధతులు పాటించి, కర్రను సేకరించి కంపోస్టు తయారీలో వాడితే రైతులకు చాలా శ్రేయస్కరం. మల్టీ శ్రడ్డర్ యంత్రంతో ఎరువుగా వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.